



తీరంలో మత్స్యకారుల సందడి

కుంభాభిషేకం రేవు కళకళ

కాకినాడ సిటీ, జూన్15: మొత్తానికి 61 రోజుల వేట విరామం తర్వాత సముద్ర జలాల్లో వేటకు వెళ్లి ఫిషింగ్ బోట్లు ద్వారా తెచ్చిన మత్స్య సంపదతో కాకినాడలోని కుంభాభిషేకం రేవు కళకళలాడింది. వేటాడిన చేపల విక్రయంతో ఆ ప్రాంతం రద్దీగా మారింది. చేపల విక్రయదారులు, పాటదారులతో శనివారం తెల్లవారుజామునుంచే హడావుడి నెలకొంది. ఈనెల 14తో సముద్రంలో చేపల వేట నిషేధం గడువు ముగిసింది. అయితే 10వ తేదీ నుంచే సముద్ర తీరంలో చిన్న బోట్లు వేటకు వెళ్లాయి. నిషేధం గడువు ముగిశాక సముద్ర జలాలలో వేటకు పెద్ద బోట్లు వెళ్లాయి. కాగా ఆదివారం కుంభాభిషేకం రేవులో కొనుగోలుదారుల తాకిడి ఎక్కువగా ఉండనుంది.



చిగురిస్తున్న 'పెట్రో' ఆశలు

కాకినాడకు కలగానే మారిన రూ.32వేల కోట్ల విలువైన పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌పై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో దీనిపై ఆశలు వదిలేసుకోగా, ఇప్పుడు మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావడంతో ప్రాజెక్టు ఏర్పాటుకు మళ్లీ అయిదేళ్ల తర్వాత క్రమేపీ అడుగులు పడుతున్నాయి. పాత ఫైళ్లకు బూజులు దులిపి కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నాలు ఊపందుకున్నాయి. విభజన హామీలో భాగంగా కాకినాడలో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ భారీ ప్రాజెక్టు అయిదేళ్ల కిందట రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రాగానే వెనక్కు వెళ్లిపోయింది. జగన్ ప్రభుత్వ అసమర్థత, మొద్దునిద్ర కారణంగా పెట్రో కాంప్లెక్స్ ఊసే మరుగున పడిపోయింది. ఏనాడు దీన్ని కాకినాడకు తీసుకురావాలని గత ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో వేలమంది జిల్లావాసులకు ఉపాధి కల్పించే అవకాశం ఉన్న ప్రాజెక్టు అటకెక్కిపోయింది. అయితే అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో వీజీఎఫ్ నిధులు భరించే అంశంపై ప్రాజెక్టు ఎక్కడ ఆగిపోయిందో మళ్లీ ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం రాకతో పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు ప్రయత్నాలకు ఊపిరి వచ్చినట్టయింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఎన్డీయేలో కీలకమైన నేపథ్యంలో ఈసారి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఈ ప్రాజెక్టును ఎలాగైనా సాధించాలని సీఎం చంద్రబాబు పట్టుదలగా ఉండడంతో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

- కాకినాడలో రూ.32 వేల కోట్ల పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై మళ్లీ ఆశలు
- టీడీపీ ప్రభుత్వం రావడంతో పాత ఫైళ్లకు బూజులు దులుపుతున్న అధికారులు
- త్వరలో కేంద్రానికి లేఖ రాయాలని నిర్ణయించిన కూటమి సర్కారు
- గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో అయిదేళ్లుగా మూలనపడ్డ ప్రతిపాదనలు
- ఏనాడూ కేంద్రంపై ఒత్తిడి తేకుండా ప్రాజెక్టును గాలికి వదిలేసిన వైనం
- చంద్రబాబు సీఎం కావడంతో 'పెట్రో' కాంప్లెక్స్ ఏర్పాటు ప్రయత్నాలు షురూ
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చురుగ్గా పెట్రోకాంప్లెక్స్ ఏర్పాటు ప్రక్రియ
- తీరా కేంద్రం సహకరించే సమయానికి రాష్ట్రంలో మారిన ప్రభుత్వం
- విభజన సమయంలోనే కాకినాడలో ఈ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు హామీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్ర ప్రభుత్వం ఒక్కో జిల్లాకు ఒక్కో కొత్త ప్రాజెక్టు కేటాయించింది. అందులోభాగంగా కాకినాడలో రూ.32వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో విభజన హామీ మేరకు 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో రెండు వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటుచేయడానికి గెయిల్-హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రోకాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయడానికి వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వ నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాల నుంచి ముడి చమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటుచేసి, దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలు ఎక్కించడానికి అప్పట్లో టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సంప్రదింపులు జరిపారు. చమురు కంపెనీల ఇంజనీర్లు వచ్చి కాకినాడ సెజ్ భూమి నాణ్యత పరీక్షించి పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు అనువుగా ఉందని తేల్చారు. దీంతో పనులు ప్రారంభించేలా కేంద్రంపై అప్పట్లో సీఎం చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. పైగా అప్పట్లో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ ప్రభుత్వం భాగస్వామిగా ఉండడంతో అనుమతి పనులు చకచకా ముందుకు కదలాయి. అయితే రూ.32వేల కోట్ల విలువైన పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు వలన కేంద్రం ఇచ్చే ఆర్థిక మద్దతు, రాష్ట్రప్రభుత్వం భారీగా లబ్ధిపొందనున్నందున పన్నుల నేపథ్యంలో రూ.5,615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. అలా అయితేనే ప్రాజెక్టు ముందుకు కదులుతుందని పేర్కొంది. కానీ రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ఈనేపథ్యంలో కేంద్రం కొంత మెత్తబడినట్లే కనిపించింది. కానీ ఈలోపు 2019లో రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. జగన్‌పై ఉన్న కేసులు, ఇతర బలహీనతల నేపథ్యంలో పెట్రో కాంప్లెక్స్ విషయమై జగన్ సర్కారు కేంద్రాన్ని నిలదీయలేక నిస్సహాయ స్థితిలోకి వెళ్లింది. రాష్ట్రప్రభుత్వ బలహీనత తెలిసి కేంద్రం కూడా దీన్ని పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో రెండేళ్లపాటు ఈ ప్రాజెక్టు ఊసు పూర్తిగా పక్కన పడిపోయింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పోయినట్టేనని విమర్శలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడింది. ప్రతిపక్ష టీడీపీ నుంచి విమర్శలు పెరగడంతో అతికష్టంపై అప్పటి కేంద్ర పెట్రోలియం మంత్రి ధర్మేంద్రప్రదాన్‌ను 2021 జూన్‌లోలో సీఎం జగన్ కలిశారు. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద తమ రాష్ట్రం ప్రాథమికంగా రూ.975 కోట్లు చెల్లించే స్థితిలో లేదని, అయినా ప్రాజెక్టు ముందుకు వెళ్లేలా సహకరించాలని ఏదో మొక్కుబడిగా కోరారు. కానీ కేంద్రం నుంచి సానుకూల ప్రకటనేదీ రాలేదు. ఆతర్వాత కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉన్నతాధికారులు ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లే విషయమై అనేకసార్లు భేటీ అయ్యారు. కానీ రాష్ట్రప్రభుత్వం నుంచి నిధుల చెల్లింపు ప్రస్తావన రాకపోవడంతో కేంద్రం కూడా ఈ విషయం పూర్తిగా పట్టించుకోవడం మానేసింది. అటు జగన్ ప్రభుత్వం కూడా మొక్కుబడిగా అడగాల్సింది అడిగేశాం.. అనే ధోరణితో పూర్తిగా దీని ఊసే వదిలేసింది. కనీసం కేంద్రంతో 2021 నుంచి తాజాగా అధికారం నుంచి దిగిపోయే వరకు దీనిపై ఒక్కసారీ మాట్లాడలేదు. దీంతో పెట్రోకాంపెక్స్ ఏర్పాటు మూలనపడింది.

మళ్లీ ఊపిరి పోస్తున్న టీడీపీ ప్రభుత్వం...

అయిదేళ్ల నుంచీ పెట్రో కాంప్లెక్స్ మూలనపడ్డంతో ఇది పోయినట్లేనని అంతా మర్చిపోయారు. పైగా రాష్ట్రంలో పెట్రోకాంప్లెక్స్ రాకపోవడానికి జగన్ ప్రభుత్వ జాప్యమే కారణమని గతేడాది కేంద్రం కుండబద్దలు కొట్టింది. తాము అన్ని అనుమతులు మంజూరు చేసినా నష్ట భర్తీ నిధి చెల్లింపుపై ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని స్పష్టంచేసింది. పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై నిర్ణయం ఏపీ ప్రభుత్వానిదేనని, రాష్ట్ర ప్రయోజనాల రీత్యా నిర్ణయం వైసీపీ సర్కారే తీసుకోవాలని సమాధానం ఇచ్చింది. ఈనేపథ్యంలో కాకినాడలో పెట్రో కాంప్లెక్స్ పోవడానికి జగన్ ప్రభుత్వానిదేనని పూర్తి తప్పని తేలిపోయింది. ఈనేపథ్యంలో రాష్ట్రంలో ఇప్పుడు తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోయిందనుకున్న పెట్రో కాంప్లెక్స్‌ను సాధించేలా సీఎం చంద్రబాబు పావులు కదుపుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రానికి ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని భావిస్తున్నారు. రూ.32 వేల కోట్లతో పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటైతే ప్రత్యక్షంగా వెయ్యి, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి దక్కనుంది. ఈ క్రమంలో ఎలాగైనా దీన్ని సాధించి తీరాలని నిర్ణయించారు. సీఎం ఆదేశాలతో తాజాగా రాష్ట్ర ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. ఎలాగైనా కాకినాడ సెజ్‌లో పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు కేంద్రం ముందుకు రావాలని కోరుతూ లేఖరాయాలని నిర్ణయించారు. మరోపక్క ప్రస్తుతం కేంద్రంలో కూటమి ప్రభుత్వ పాత్ర చాలా కీలకంగా మారింది. టీడీపీ మద్దతు వల్లే ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటు జరిగింది. దీంతో కేంద్రంతో ఉన్న సఖ్యతతో దీన్ని ఎలాగైనా సాధించాలని ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం పట్టుదలగా ఉంది. దీంతో ప్రధానితోను పెట్రోకాంప్లెక్స్ ఏర్పాటు గురించి చర్చించి, ఏపీ ప్రభుత్వం వీజీఎఫ్ భరించక్కర్లేకుండానే దీన్ని తెచ్చుకోవాలని ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందుకోసం త్వరలో అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో పోయిందనుకున్న భారీ ప్రాజెక్టు తిరిగి రావడానికి వడివడిగా అడుగులు పడుతుండడం విశేషం. ఇదిలాఉంటే రాష్ట్రానికి బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజెక్టు వచ్చేలా సీఎం చంద్రబాబు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అనేక రాష్ట్రాలు దీనికోసం పోటీపడుతున్నా, ఏపీకీ ఇచ్చేలా కేంద్రంపై లేఖ ద్వారా ఒత్తిడికి సిద్ధమవుతున్నారు. దాదాపుగా రూ.50వేల కోట్ల పెట్టుబడితో ఇది మచిలీపట్నంలో రానుంది. దీంతో ఇప్పుడు కాకినాడ సెజ్‌లో పెట్రోకాంప్లెక్స్ కూడా రావడం ఖాయమన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.





కాకినాడలోని జవహర్‌వీధిలో ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ భవనం.. సంతచెరువు సెంటర్ వద్ద నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం

అందుబాటులోకి అన్న క్యాంటీన్‌లు

- మరమ్మతులకు సన్నాహాలు
- సెప్టెంబర్ 21 నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు

కాకినాడ సిటీ, జూన్ 15 : తెలుగుదేశం ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిన అన్న క్యాంటీన్‌లు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి అయిదు సంతకాల్లో భాగంగా అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగవ సంతకం చేసిన విషయం విదితమే. ఆ మేరకు అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణకు చకచకా వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైపోయింది. ఇందులో పురపాలక, నగరపాలక సంస్థల అధికార యంత్రాంగాన్ని ఇందులో భాగస్వాములను చేసింది. ఈనెల 15వ తేదీ శనివారం నుంచి ఈ ప్రక్రియ మొదలుకాగా సెప్టెంబర్ 21లోగా రాష్ట్రంలోని 203 అన్న క్యాంటీన్‌లను ప్రారంభించనున్నారు. జిల్లా కేంద్రం కాకినాడ నగరంలో అయిదు చోట్ల అన్న క్యాంటీన్‌లు ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజాట్యాంక్ సెంటర్, సంతచెరువు సెంటర్, డెయిరీఫారమ్ సెంటర్, అన్నమ్మ ఘాటీ సెంటర్, బోటు క్లబ్ చెరువు కూడలిలో వీటిని ఏర్పాటు చేశారు. రూ.5కే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందించారు. అన్ని క్యాంటీన్‌లు రద్దీగా ఉండేవి. నిర్దేశించిన ప్రకారం టోకెన్లు విక్రయించి టిఫిన్, భోజనం అందించేవారు. టిఫిన్‌కు రూ.18 ఖర్చు అవుతుండగా, పేదల నుంచి వసూలుచేసే రుసుం రూ.5 మినహా మిగిలిన రూ.13 రాయితీని, ఒక్కో పూట భోజనానికి రూ. 27.50 ఖర్చవుతుండగా, వసూలు చేసే రూ.5 మినహా మిగిలిన రూ.22.50 రాయితీని ఏజన్సీకి ప్రభుత్వం అందజేసేది. కాగా కాకినాడలో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు శనివారం నుంచే కార్యాచరణ ఆచరణలోకి వచ్చింది. ఈ భవనాల్లోని ఫర్నిచర్, స్టీమ్ ఎక్విప్‌మెంట్ పరికరాలు, ఇతర అవసరాలపై ప్రాథమిక నివేదిక రూపొందించారు. జూలై నెలాఖరులోగా వీటిలోని సచివాలయాలు, డిస్పెన్సరీలను ఖాళీ చేయించి ఆగస్టు నెలాఖరులోగా మరమ్మతులు, స్టీమ్ ఎక్విప్‌మెంట్ వంటివి సమకూరుస్తారు.





స్పార్క్ హబ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, సైంటిస్టు విక్రాంత్.. హన్సిత్‌ను అభినందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

యర్రవరంలో స్పార్క్ ఇన్నోవేషన్ హబ్

ప్రారంభించిన జిల్లా ఎస్పీ, డీఆర్‌డీవో సైంటిస్ట్

ఏలేశ్వరం, జూన్ 15: సైంటిఫిక్ ప్రోగ్రాం, రీసెర్చ్ క్యూబ్ మూడో వార్షికోత్సవం సందర్భంగా ఇన్నోవేషన్ హబ్‌ను యర్రవరం గ్రామంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, డీఆర్‌డీవో సైంటిస్ట్ విక్రాంత్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సాంకేతిక విద్యపై అవగాహన పెంచుకుని ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్న స్పార్క్ చైర్మన్ సాయిసందీప్ టీమ్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా సాయిసందీప్ మాట్లాడుతూ ఆదివారం ఏలేశ్వరంలో సైబర్ నేరాలు, సాంకేతిక విద్యపై శాస్త్రవేత్తలు, పోలీసు అధికారులతో మహిళలకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శేఖర్‌బాబు, సర్పంచ్ బొశెట్టి అప్పలరాజు, కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, ఆదిత్యరోజి, సాహిల్, ఐశ్వర్య పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో పతకాలు సాధించిన బాలుడికి అభినందన

కాకినాడ క్రైం, జూన్15: జాతీయ స్థాయిలో రోలర్ స్కేటింగ్ విభాగంలో స్వర్ణ, కాంస్య పతకాలు సాధించిన ఏడేళ్ల మాస్టర్ కుంచే హన్సిత్‌ను ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ శనివారం అభినందించారు. జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కుంచే రాజేష్ తనయుడైన హన్సిత్ చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో ఇటీవల స్పీడ్ స్కేటింగ్‌లో జరిగిన 7వ నేషనల్ ర్యాంకింగ్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న హన్సిత్ పోటీల్లో 600 మీటర్ల స్పీడ్ స్కేటింగ్‌లో స్వర్ణ పతకం, 400 మీటర్ల స్పీడ్ స్కేటింగ్‌లో కాంస్య పతకం సాధించాడని ఎస్పీ తెలిపారు. బాలుడికి మంచి శిక్షణను ఇచ్చిన కోచ్ చంటికృష్ణను, హన్సిత్ తండ్రి రాజేష్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



ఉల్లి ఘాటు!

- అంతకంతకూ పెరుగుతున్న ధర
- అదే బాటలో టమాటా రేట్లు
- నాణ్యతను బట్టి కిలో ఉల్లి రూ.35-50
- టమాటా కిలో ధర రూ.60
- బీర రూ.80-100
- అల్లం రూ.200
- మిగిలిన కూరగాయలు పైకే
- ప్రజలకు షాకిస్తున్న ధరలు
- ఏది కొనాలన్నా హడలిపోతున్న వైనం

ఉల్లి ధర ఘాటెక్కుతున్నది. నిన్న మొన్నటి వరకూ కిలో రూ.20-25 మధ్య కదలాడిన ధర రూ.35-50కు చేరుకుంది. టమాటా ధర కొండెక్కుతోంది. ఇప్పటికే కిలో రూ.60 దాటింది. ఈ రెండింటి ధరలు సెంచరీకి చేరుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. బీరకాయలు కిలో రూ.80-100 పలుకుతుండగా, అల్లం రూ.200కి చేరింది. దాదాపు కూరగాయలన్నీ ఒకట్రెండు మినహా కిలో రూ. 50 దాటే ఉన్నాయి. మార్కెట్‌కు వెళ్లిన ప్రజలకు ఈ ధరలు షాకిస్తున్నాయి.

(పిఠాపురం)

ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు గరిష్ఠస్థాయికి చేరడం, అకాల వర్షాల కారణంగా కూరగాయలు పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. వేసవి అనంతరం వేసి పంట చేతికందేందుకు మరో రెండు నెలలు సమయం పట్టే అవకాశం ఉంది. డిమాండ్ పెరగడం, మార్కెట్లకు సరుకు అంతంతమాత్రంగానే వస్తుండడంతో ధరలన్నీ పెరుగుదల బాటపట్టాయి. గత రెండు వారాల్లోనే ధరలు 50 నుంచి 100 శాతం పెరిగాయి. మరికొన్నింటి ధరలు 300 శాతానికి పైగా పెరిగాయి. కొత్త పంట మార్కెట్‌కు వచ్చే వరకూ ఇదే పరిస్థితి కొనసాగవచ్చని బావిస్తున్నారు. అంతవరకూ ధరల షాక్ ప్రజలకు తప్పదని మార్కెట్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ధర అధికంగా ఉన్నా నాణ్యమైన సరుకు రావడం లేదని ప్రజలు చెబుతున్నారు. దాంతో ఉన్న దాంట్లోనే మంచి సరుకును కొనుగోలు చేయాల్సి వస్తోంది.

షాకిస్తున్న ఉల్లి ధరలు

ఉల్లి ధరలు గణనీయంగా పెరుగుతున్నాయి. రెండు వారాల కిందట వరకూ కిలో రూ. 20-25 మధ్య ఉన్న ధర ఒక్కసారిగా రూ.50కు చేరుకుంది. నాణ్యతను బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. ఒక మాదిరి నాణ్యతతో ఉన్న ఉల్లి కిలో ధర రూ.35 పలుకుతుండగా, ఫైన్ రకం ధర రూ.50 వరకూ ఉంది. ప్రస్తుతం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలు నుంచే ఉల్లిపాయలు వస్తున్నాయి. ఇక్కడ రబీలో వేసి ఉల్లి పంటలు అకాల వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో 50 శాతం వరకూ దిగుబడులు తగ్గిపోయాయి. ఇదే అదనుగా మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు ఉల్లిని భారీగా నిల్వ చేశారు. మార్కెట్‌కు అరకొరగానే ఉల్లి నిల్వలను విడుదల చేస్తున్నారు. కానీ నాణ్యత అంతంతమాత్రమే. నాలుగైదు రోజుల నుంచి నిల్వ చేసిన ఉల్లిని మార్కెట్‌కు పంపుతున్నారు. అయితే ధరలు పెంచడంతో ఆ ప్రభావం మార్కెట్‌పై పెడింది. ఉల్లి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్‌వర్గాలు చెబుతున్నాయి. ఇతర రాష్ట్రాల్లోకంటే ఉల్లి ధరలు అధికంగా ఉన్నాయని, కేంద్రం జోక్యంతోనే అదుపులోకి వస్తాయని భావిస్తున్నారు.

టమాటా ధరలు పైపైకి..

నెలరోజుల కిందట వరకూ కిలో రూ.20 ఉన్న టమాటా ధర శనివారం నాటికి రూ.60కి చేరింది. ఇది రూ.100 వరకూ చేరుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లి, ఉమ్మడి కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల్లో టమాటా ఎక్కువ పండుతుంది. కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో టమాటా పంట సాగు చేసినా ధరలు మాత్రం మదనపల్లి, కర్నూలు మార్కెట్‌లపైనే ఆధారపడి ఉంటాయి. అక్కడ వేసిన పంట దెబ్బతినడంతో టమాటాకు డిమాండ్ పెరిగింది. ఫలితంగా టమాటా ధర రోజురోజుకి పెరుగుతోంది. మార్కెట్‌లో లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ధర మరింత పెరుగుతుందని చెబుతున్నారు.

కూరగాయలన్నీ అదే బాటలో..

ఎండతీవ్రత అధికంగా ఉండడం, పంట కీలక దశలో కురిసిన అకాల వర్షాలు కూరగాయల పంటలకు తీవ్ర నష్టాన్ని కలుగజేశాయి. కాకినాడ జిల్లాలోని పిఠాపురం, ప్రత్తిపాడు, గొల్లప్రోలు, శంఖవరం, రౌతులపూడి, గండేపల్లి, కోటనందూరు తదితర మండలాల్లో కూరగాయల పంటలు అధికంగా సాగవుతున్నాయి. ఇక్కడ పంట దెబ్బతినడంతో దిగుబడులు తగ్గిపోయాయి. ఫలితంగా డిమాండు ఏర్పడింది. ఎప్పుడూ కిలో రూ.60 దాటని బీరకాయల ధరలు తొలిసారి రూ.80-100కి చేరుకున్నాయి. అల్లం కిలో ధర మళ్లీ రూ.200 దాటింది. పచ్చిమిర్చి కిలో రూ.80 ఉండగా, చిక్కుడు రూ.80-100, దొండ, బెండకాయలు కిలో రూ.40-50, క్యారెట్ రూ.50, చేమదుంపలు కిలో రూ.50-55 మధ్య విక్రయాలు సాగుతున్నాయి. అలాగే బంగాళాదుంపలు కిలో రూ.40, కంద రూ.70, క్యాప్సికమ్ రూ90, కాకరకాయ రూ.60, బీన్స్ కాయలు రూ.100, బీన్స్ గింజలు కిలో రూ.130 వరకూ ఉన్నాయి, ఆనబకాయ ఒక్కటి సైజును అనుసరించి రూ.25నుంచి 40 వరకూ ఉండగా, దోసకాయ రూ.20 ములక్కాడ ఒక్కటి సైజుని బట్టి రూ.6 నుంచి రూ.10 వరకూ ఉంది. మిగిలిన కూరగాయల ధరలు ఇదే స్థాయిలో ఉన్నాయి. వేసవిలో వేసిన పంట రైతుల చేతికందేందుకు మరో 30-45 రోజులు పట్టే అవకాశం ఉంది. అప్పటివరకూ ఇదే ధరలు కొనసాగే అవకాశం ఉంది. కొన్ని రకాల కూరగాయలు అసలు మార్కెట్‌లో దొరకడం లేదని పలువురు చెబుతున్నారు. జిల్లాలోని రైతుబజార్లలతోపాటు మార్కెట్లలోనూ ఇవే రేట్లు ఉండడంతో కొనేందుకు వెళ్లిన ప్రజలు షాక్‌కు గురవుతున్నారు. కొత్త పంట మార్కెట్‌కు వచ్చేవరకూ ధరలు అధికమైనా కొనక తప్పదని వారు అంటున్నారు. ఇక ఉల్లి ధరల అదుపుచేసేందుకు ప్రభుత్వం ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కొమ్మనాపల్లిలో కొత్తగా మరో 28 డయేరియా కేసులు



తొండంగి: బాధితుడిని పరామర్శిస్తున్న సుబ్రహ్మణ్యేశ్వరి

తొండంగి, జూన్ 15: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లిలో డయేరియా ఉధృతి కొనసాగుతోంది. వరుసగా మూడో రోజైన శనివారం కొత్తగా 28 కేసులు నమోదయ్యాయి. వీరిలో 16 మందిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, స్థానికంగా 12 మందికి సచివాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ రవికుమార్ డాక్టర్ భారతి చికిత్స అందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డయేరియా లక్షణాలతో వచ్చిన వారికి స్థానికంగా ప్రథమ చికిత్స అందించి తక్షణం కాకినాడ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డుకు తరలిస్తున్నారు. దీని నిమిత్తం వైద్య శిబిరం వద్ద మూడు అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అదనపు వైద్యులను వైద్య సిబ్బందిని నియమించారు. ఆశ వర్కర్లు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామంలో 224 గృహాలను సందర్శించి సర్వే నిర్వహించారు. కాకినాడలో సుమారు 25 మంది వరకూ చికిత్స పొందుతున్నారు. కొందరు వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. వివిధ గ్రామాల సచివాలయ సిబ్బందిని రప్పించి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్లు, జేసీబీలను ఉపయోగించి కాల్వల్లో పూడిక తొలగించారు. వీధివీధికి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

గ్రామాన్ని సందర్శించిన వైద్యఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్

వైద్యఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాయక్‌తో కలిసి శనివారం గ్రామంలో పర్యటించారు. డయేరియా బాధిత కుటుంబాలు ఉన్న వీధికి తాగునీటిని సరఫరా చేసే ట్యాంకు వద్దకు వెళ్లి పరిశీలించారు. సమీపంలో పెంట గొయ్యి, అపరిశుభ్ర వాతావరణం ఉండడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. గోతికి ,బోరుకు మధ్య ఉన్న దూరాన్ని కొలిపించగా 20 మీటర్ల లోపు ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. కనీసం 30 మీటర్ల దూరం ఉండాలన్నారు. గోతిని పూడ్చివేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్ మార్గాన్ని పరిశీలించారు. బాధితులు ఉన్న ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. అనంతరం ఆమె వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి అందిస్తున్న చికిత్సపై ఆరా తీశారు. నిరంతరం అప్రమత్తంగా ఉండి రోగులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. ఎంపీడీవో మార్కండేయులు, గ్రామ సర్పంచ్ అమ్మాజీ సూర్యనారాయణ తదితరులు అధికారుల వెంట ఉన్నారు.

జీజీహెచ్‌లో పలువురికి చికిత్స

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 15 తొండంగి మండలం కొమ్మనాపల్లి డయేరియా బాధితులకు చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం నాటికి 24 మందికి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సను అందిస్తుండగా మరో 20 మంది బాధితులను వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శనివారం జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉన్న మరో ముగ్గురిని ఇప్పటికే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రత్యేక వైద్య చికిత్సను అందిస్తున్న విషయం తెలిసిందే. జీజీహెచ్ ఈఎన్‌టీ విభాగంలో శుక్రవారం 25 పడకల సామర్థ్యంతో ప్రత్యేక డయేరియా వార్డును ఏర్పాటు చేశారు. అయితే డయేరియా బాధితుల సంఖ్య పెరగడంతో మరో 15 పడకలతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేశారు. అన్ని మౌలిక సదుపాయాలతో పాటు మెడిసిన్, అనస్తీషియా వైద్య నిపుణుల బృందంతో పాటు వైద్య సిబ్బంది నిరంతరం మూడు షిఫ్టులలో సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం 44 మంది బాధితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

బాగా బతికి..చితికిపోయి

ఫ్లైఓవర్‌పై నుంచి దూకి అన్నదమ్ముల ఆత్మహత్య

రాజమహేంద్రవరం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బాగా బతికారు.. తర్వాత చితికిపోయారు.. తల్లిదండ్రులు మృతితో చూసేవారులేకపోయారు. అయిన వాళ్లకు దూరమయ్యారు.. ఒంటరిగా కాలం వెళ్లదీస్తూ మానసికంగా కుంగిపోయారు.. జీవితంపై విరక్తి చెంది చివరికి ఆ అన్నదమ్ములు ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. ముత్తాబత్తుల నాగాంజనేయ(42), ముత్తాబత్తుల దుర్గారామ్(40) అన్నదమ్ములు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శంభూనగర్ ప్రాంతంలోని సాయికృష్ణనగర్‌లోని సొంతింట్లో నివాసం ఉంటున్నారు. వీళ్లలో ఒకరు ఎంబీఏ, మరొకరు ఎంసీఏ చదివారు. సుమారు 15 ఏళ్ల కిందట బెంగళూరులో ఉద్యోగాలు చేసేవాళ్లు. తల్లి చాలా ఏళ్ల కిందటే చనిపోయారు. తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో సుమారు పదేళ్ల కిందట ఆయన బాగోగులు చూసుకోవాలంటూ ఉద్యోగాలు వదిలి వచ్చేసి ఇక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో కరోనాకు ఏడాది ముందు తండ్రి కూడా మరణించాడు. ఏళ్ల తరబడి ఎలాంటి ఉపాధి లేకుండా ఉండడంతో అప్పుల్లో మునిగిపోయారని తెలుస్తోంది. ఈ క్రమంలో అన్నదమ్ములు ఒంటరిగా కాలం వెళ్లదీస్తున్నారు. అప్పులు చేయడం ఏదో ఒక ఊరు వెళ్లడం, లాడ్జీలో రూం తీసుకొని మళ్లీ కొద్ది రోజుల తర్వాత తిరిగి రావడం జరిగేది. ఎవరినీ ఇంటి లోపలకు రానిచ్చేవారు కాదు. ఇళ్లు కూడా శుభ్రం చేసుకోకపోవడంతో పాడుబడిన బంగ్లా మాదిరిగా తయారైంది. వాటర్ బాటిల్స్‌తో సహా ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టి రప్పించుకోవడం, ఆ సమయంలో మాత్రమే తలుపు తీసి వాటిని తీసుకోవడం జరిగేది. బయటకు అతి తక్కువగా కనబడడంతో పాటు బంధువులకు కూడా దూరంగా ఉంటూ వచ్చారు. ఇద్దరూ వివాహం చేసుకోలేదు. ఆలనాపాలనా కరువైంది. మానసికంగా కుంగిపోయారు. అప్పుల నిమిత్తం తమకు ఉన్న భూమిని కూడా ఇటీవలే అవతలి వారి పేరున రిజిస్ట్రేషన్ చేశారని తెలుస్తోంది. ఈ క్రమంలో పేమెంట్‌ను తీసుకెళ్లాలంటూ ఓ లాడ్జి నుంచి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అంబులెన్స్‌ను రప్పించుకున్నారు. రోడ్ కం రైలు బ్రిడ్జి, కొవ్వూరు, విజ్జేశ్వరం ఇలా తిప్పుతుండడంతో అంబులెన్సు డ్రైవరుకు అనుమానం వచ్చి లాడ్జి వద్ద దింపేస్తానని చెప్పాడు. కానీ తమను ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్‌పై దింపాలని వాళ్లు చెప్పడంతో డ్రైవరు నిరాకరించగా అతనితో వాగ్వివాదానికి దిగారు. చివరికి వాళ్లను తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఫ్లైఓవర్‌పై డ్రైవరు దింపేసి వెళ్లిపోయాడు. ఉదయం ఫ్లైఓవర్ కింద ఇద్దరు మృతి చెందిన స్థితిలో ఉన్నారని సమాచారం తెలియడంతో పోలీసులు వచ్చి తదుపరి ప్రక్రియ చేపట్టారు. ఫ్లైఓవర్ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమికంగా అంచనాకు వచ్చామని, కేసు దర్యాప్తులో ఉందని సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. అయితే చుట్టుపక్కల ఇళ్ల వద్ద సుమారు కొంత మొత్తం అప్పు తీసుకున్న అన్నదమ్ములు తిరిగి తాము ఇవ్వలేమని అప్పు ఇచ్చిన వారికి చెప్పినట్లు తెలిసింది. .



దుర్గారామ్, నాగాంజనేయ మృతదేహాలు



బాధిత మహిళలందరికీ న్యాయం చేస్తాం

హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత



హోం మంత్రి అనితకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అంతర్వేది ఆలయ అధికారులు

అంతర్వేది, జూన్ 15: గత ఐదు సంవత్సరాల్లో వివిధ సంఘటనల్లో బాధితులుగా ఉన్న మహిళలు, సామాన్య ప్రజలకు భద్రత కల్పించే దిశగా పని చేస్తానని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని సహించేది లేదన్నారు. సామాన్యులు ఆస్తులు పోగొట్టుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. అంతర్వేది ఆలయానికి వచ్చిన మంత్రి అనిత విలేకర్లతో మాట్లాడారు. గత ఐదేళ్లుగా గంజాయి, మత్తు పదార్థాలతో రాష్ట్రం సర్వనాశనమైపోయిందని, యువత వాటి బారిన పడకుండా, మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా పోలీసు శాఖతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో అమలాపురం, మోరిపోడుల్లో ఆడపిల్లలకు అన్యాయం జరిగినప్పుడు కుటుంబాలను పరామర్శించానని, భవిష్యత్తులో అటువంటి ఘటనలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు. కూటమి విజయం సాధించిన తరుణంలో మలికిపురం నుంచి అంతర్వేది వరకు పాదయాత్ర చేస్తున్న అంతర్వేదిపాలెం పుల్లయ్యను హోం మంత్రి అనిత ఈ రందర్భంగా అభినందించారు.

ఆలయంలో పూజలు

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం విచ్చేశారు. ఎన్నికల సమయంలో దర్శించుకుని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరలా దర్శించుకుంటానని కోరుకున్నానన్నారు. ఈ నేపథ్యంలో దర్శనానికి వచ్చినట్లు చెప్పారు. తొలుత ఆమెకు ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో దర్శనం చేయించి వేద పండితులతో మహదాశీర్వచనం ఇప్పించారు. మంత్రికి ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. నల్లా సత్యకిరణ్‌ప్రసాద్ భగవద్గీత, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని మోరి జీడిపప్పు అచ్చును హోం మంత్రికి బహూకరించారు. మంత్రి వెంట సీఐ గోవిందరాజు, ఎస్‌ఐ ఎస్.రాము, ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి, వనమాలి మూలాస్వామి, ముప్పర్తి నాని, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, అయినపర్తి ఏసు, ఎంపీటీసీ బైరా నాగరాజు, కూటమి నాయకులు ఉన్నారు.

సత్యదేవుని దర్శనం

అన్నవరం, జూన్ 15: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, స్థానిక శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ శనివారం స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా ఈవో వారికి పట్టువస్త్రాలను, ప్రసాదం అందజేశారు. ముందుగా వినాయక అతిథి గృహానికి చేరుకున్న మంత్రికి పోలీసులు గౌరవవందనం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పర్వత సురేష్, పసుపులేటి చక్రి, రాజాల చిట్టిబాబు, పలివెల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

యజమాని మోసం చేశాడంటూ యువకుడి బలవన్మరణం

పోలీసులు వాంగ్మూలం దాచడంపై అనుమానాలు



రాజమహేంద్రవరం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడడం వివాదాస్పదమైంది. ఈ యువకుడి మరణ వాంగ్మూలాన్ని పోలీసులు దాస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం.. గండూరి శ్రీకాంత్ (30) తన తల్లితో కలిసి రైల్వే క్వార్టర్‌లో ఉంటున్నాడు. తండ్రి చనిపోవడంతో ఆ ఉద్యోగం తల్లికి వచ్చింది. ప్రస్తుతం ఆమె రైల్వే ఎలక్ట్రికల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. షెల్టాన్ హోటల్ సమీపంలోని ఓ పెట్రోలు బంకులో శ్రీకాంత్ ఐదేళ్ల నుంచీ పనిచేస్తున్నాడు. బంకు యజమాని మేనల్లుడు అయిన శ్రీనుతో పరిచయం ఏర్పడింది. ఎక్కడైనా కార్లు ఆగిపోయినా.. లేదా ఇతర వాహనాలకు ఇద్దరూ కలిసి ఇంధనాన్ని తీసుకెళ్లి నింపడం జరిగేది. అలా తీసుకెళ్లినందుకు ఆ వాహనదారుల వద్ద నుంచి కొంత మొత్తం అదనంగా తీసుకునేవాళ్లు. ఆ ఆదాయం బాగానే ఉండేది. అయితే పెట్టుబడి పెట్టడానికి కాస్త ఇబ్బంది పడుతుండడంతో ఆ సంగతి తాను చూసుకుంటానని, లాభంలో 25 శాతం వాటా ఇస్తానని యజమాని చెప్పడంతో వాళ్లు అంగీకరించారని సమాచారం. శ్రీకాంత్ తన జీతం కూడా యజమాని వద్దే ఉంచేసేవాడని అంటున్నారు. వీళ్లకు వాటా కింద వచ్చిన మొత్తాన్ని కూడా యజమాని వద్ద పెట్టుబడిగా పెట్టారు. కొన్నాళ్ల తర్వాత తమ డబ్బులు తమకు ఇవ్వాలని అడగ్గా ఆ యజమాని కాలయాపన చేస్తూ వచ్చాడు. గత గురువారం ఇస్తానని ఈ గురువారానికి (13)కి వాయిదా వేశాడు. ఇదే విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న తన తమ్ముడికి కూడా ఫోన్ చేసి బాధపడ్డాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి శ్రీకాంత్ ఏడుస్తూ ఇంటికి వచ్చాడు. ఉదయం తల్లి ఉద్యోగానికి వెళ్లిన వెంటనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని శ్రీనుకు మెసేజ్ పెట్టాడు. అతడు వచ్చేలోగా ఘోరం జరిగిపోయింది. ఫ్యానుకు దుప్పటితో ఉరి వేసుకున్నాడు. అయితే తాను పెట్టుబడిగా పెట్టిన డబ్బులు తనకు రూ.35 లక్షల వరకూ వస్తాయని అవి వచ్చిన వెంటనే హైదరాబాద్ తమ్ముడి దగ్గరికి వెళ్లిపోదామని రెండున్నరేళ్ల నుంచీ అంటున్నాడని తల్లి రేణుకా దేవి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రోజు రేపు అంటూ యజమాని చెబుతుండడంతో మనస్తాపం చెంది ప్రాణాలు తీసుకున్నాడని రోదించారు. 'అమ్మా క్షమించు. ఓనరు నాకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. అందుకే నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని ఓనరు పేరు స్పష్టంగా సూసైడ్ నోట్‌లో శ్రీకాంత్ పేర్కొన్నాడని తెలుస్తోంది. అయితే దర్యాప్తు కారణాలతో సూసైడ్ నోట్‌ని రహస్యంగా ఉంచుతున్నామని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు.

కువైట్ అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



ఎక్స్‌గ్రేషియా చెక్కు అందిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, జూన్ 15: కుటుంబ పోషణ కోసం దూర ప్రాంతానికి వెళ్లి మృత్యువాత పడిన కుటుంబాల బాధ వర్ణనాతీతమని, ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కువైట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పెరవలి మండలం అన్నవరప్పాడుకు చెందిన మీసాల ఈశ్వరరావు, ఖండవల్లికి చెందిన మొల్లేటి సత్యనారాయణ మృతి చెందారు. వారి మృతదేహాలను విమానంలో తొలుత కేరళకు, అక్కడి నుంచి విశాఖ పట్నానికి విమానంలో తరలించారు. స్థానిక అధికారులు విశాఖపట్నం వెళ్లి అంబులెన్స్‌లో వాటిని పెరవలి మండలానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆ కుటుంబాలను పరామర్శించడానికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ సరైన ఉపాధి అవకాశాలు లేవనే కారణంతో ఎక్కడికో వెళ్లి కుటుంబ పోషణ కోసం పనిచేస్తూ అగ్ని ప్రమాదంలో మరణించడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలను అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షలు చొప్పున మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని ఇరు కుటుంబాలకు అందజేసినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రధాన మంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి మరికొంత ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కొవ్వూరు ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ ఆర్.కృష్ణనాయక్, అతికాల శ్రీను, పిప్పర రవి, రంగినీడి గంగాధరరావు, సింహాద్రి సత్యనారాయణ, బొడ్డు రామాంజనేయులు, భూపతిరాజు రవివర్మ, కట్టయ్య, తహశీల్దార్ సుధ పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

రేపు బాలబాలాజీ తిరు కల్యాణోత్సవం

అప్పనపల్లిలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలంకరణ





మామిడికుదురు, జూన్ 15: వైనతేయ నదీ తీరంలో వేంచేసి ఉన్న అప్పనపల్లి బాలబాలాజీస్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఏడు ప్రదక్షిణలు ఏడు శనివారాలు చేసి ఏడు నారికేళాలు సమర్పించినంతనే కోరిన కోర్కెలు నెరవేర్చే శ్రీబాలబాలాజీ స్వామివారి కల్యాణాన్ని 17వ తేదీ సోమవారం రాత్రి 8.59 గంటలకు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఆలయం చుట్టూ చలువ పందిళ్లు వేసి కల్యాణ శోభను తీసుకువచ్చారు. 16వ తేదీ ఆదివారం నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభమై 20వ తేదీ గురువారం వరకు శ్రీవారి శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఐదు రోజుల పాటు కల్యాణోత్సవాలను పురస్కరించుకుని పలు పూజా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. స్వామివారి తిరు కల్యాణాన్ని చినజీయర్ స్వామివారి శిష్యుడు చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు, గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చక బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ఈవో (గంధి మాధవి పర్యవేక్షణలో కల్యాణోత్సవాలు వైభవంగా జరగనున్నాయి. భక్తులు కల్యాణోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని సహాయ కమిషనర్ కోరారు.

బాల బాలాజీ శనివారం ఆదాయం రూ.2,80,050

అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,80,050 ఆదాయంగా వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని 3697 మంది దర్శించుకుని 3051 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.


జీవ వైవిధ్య పరిరక్షణతో మానవ మనుగడ

దివాన్‌చెరువు, జూన్ 15: మానవాళి మనుగడకు జీవ వైవిధ్య పరిరక్షణ ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సభ్య కార్యదర్శి బీఏవీ కృష్ణమూర్తి అన్నారు. లాలాచెరువులోని రాష్ట్ర అటవీ శిక్షణా అకాడమీలో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సౌజన్యంతో రెండురోజుల పాటు నిర్వహించిన జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభకు కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీవవైవిధ్యం అందరి సంపద అన్నారు. ఈ జీవవైవిధ్యంను కాపాడుకుంటూ భావితరాలకు దానిని భద్రంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జీవవైవిధ్యం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. సాంప్రదాయ వైద్యాన్ని ప్రపంచానికి తెలియచెప్పిన ఘనత భారతదేశానికే దక్కుతుందన్నారు. అలాగే జీవవైవిధ్య యాజమాన్య కమిటీలు తక్షణం చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు రాష్ట్రంలోని 14,300 జీవ వైవిధ్య యాజమాన్య కమిటీలు ఉన్నాయన్నారు. అన్ని గ్రామ పంచాయతీలతో పాటు అర్బన్ ప్రాంతాలలో కూడా ఈ కమిటీలు ఉన్నాయని చెప్పారు. జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణ నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ సందర్భంగా జీవవైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణ కరదీపిక ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ, జీవవైవిధ్యమండలి ప్రాంతీయ కోఆర్డినేటర్లు బి.జానకీరామ్, డాక్టర్ చెన్నకేశవనాయక్, సత్యప్రసాద్, శిక్షణా కార్యక్రమం కోఆర్డినేటర్ వి.శ్రీహరిగోపాల్, ఎన్.వి.శివరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలి సభ్యకార్యదర్శి కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు.

తాటాకిల్లు, పశువుల పాకకు నిప్పు

పిఠాపురం, జూన్ 15: కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారు సీతారాంపురంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.30 గంటల సమయంలో వాసంశెట్టి రాంబాబుకు చెందిన తాటాకిల్లు, పశువుల పాక, గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ప్రమాదంలో ఇల్లు, పాక, గడ్డివాము పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో ఉంచిన లక్ష రూపాయల నగదు, రూ. 3 లక్షలకు పైగా విలువైన సామగ్రి దగ్ధమయినట్లు రాంబాబు పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. కొందరు వ్యక్తులు కక్ష కట్టి కావాలనే తన ఇంటికి నిప్పు పెట్టారని రాంబాబు తెలిపారు.

గుండెపోటుతో ఎస్‌ఐ మృతి



కోటనందూరు, జూన్ 15: కాకినాడ జిల్లా కోటనందూరు గ్రామానికి చెందిన పంపనబోయిన వెంకటరమణ (54) గుండెపోటుతో మృతిచెందారు. విజయవాడ కృష్ణలంకలో ఎస్‌ఐగా పనిచేస్తున్న వెంకటరమణ డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చి బాత్‌రూమ్‌కి వెళ్లి గుండెపోటుతో కుప్పకూలిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకటరమణ కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నారు. ఆర్మీలో పదవీ విరమణ చేసి ఎస్‌ఐగా చేరారు. సీఐడీ, వివిధ పోలీస్‌స్టేషన్స్‌లో ఎస్‌ఐగా పనిచేశారు. పోలీసుల అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

రేపటి నుంచి భీమేశ్వరాలయంలో దర్శనాలు

పునఃప్రారంభం



సామర్లకోట, జూన్ 15: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో శివలింగ జీర్ణోద్ధారణ పనులు పూర్తయ్యినందున సంప్రోక్షణ పూజలు శాస్త్రోక్తంగా ఆదివారం నిర్వహించి 17న సోమవారం ఏకాదశి పర్వదినం నుంచి స్వామివారి దర్శనాలు యథాతథంగా భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం శనివారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. గత నెల 28 నుంచి భారతీయ పురావస్తు శాఖ ఆధీనంలో శివలింగ జీర్ణోద్ధారణ పనులు నిర్వహిస్తున్న విషయం విదితమే. జీర్ణోద్ధారణ పనులు శనివారం నాటికి పూర్తిచేసి ఆలయాన్ని తమకు భారతీయ పురావస్తు శాఖ అధికారులు అప్పగించడంతో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ చర్యలకు సిద్ధం చేశామన్నారు. ఆదివారం సంప్రోక్షణ చర్యలు పూర్తి చేసి సోమవారం నుంచి భక్తులకు శివలింగ దర్శనాలు యథాతథంగా పునరుద్ధరించనున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా భారతీయ పురావస్తు శాఖ అధికారుల ఆదేశాల మేరకు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు ఈ నెల 23 వరకూ నిర్వహించేందుకు అనుమతులు లేనందున భక్తులు సహకరించాలని ఈవో నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, శ్రీనివాసరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం కేసులో ఇద్దరి అరెస్టు

రామచంద్రపురం(ద్రాక్షారామ) , జూన్ 15 : డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం యర్రపోతవరంలో డా.బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన కేసులో గ్రామ సర్పంచ్‌తో పాటు మరో వ్యక్తిని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామకృష్ణ వివరాలు అందించారు. ఈనెల 8న రాత్రి యర్రపోతవరం లాకుల వద్ద ఉన్న డా.బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎడమ చేతికి చెప్పుల దండ వేసి వర్గాల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు బోర్డు మీద అవమానకర వ్యాఖ్యలు రాసి వేలాడదీశారన్నారు. దీనిపై విప్పర్తి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పామర్రు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు ఉన్నతాధికారుల పర్యవేక్షణలో తనతో పాటు సీఐ దొరరాజు, ఎస్‌ఐలు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు (బీసీ సామాజికవర్గం) కోరుకొండ స్వామినాయుడు (ఎస్సీ సామాజికవర్గం) ఇరువురు పథకం ప్రకారం 8వ తేదీ రాత్రి స్వామినాయుడు ఇంటిపక్క ఉన్న చెత్త కుప్ప నుంచి సేకరించిన మూడు చెప్పులతో దండగా కట్టి, తెల్లకాగితంపై కొన్ని వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా అవమానకర రీతిలో రాసి అట్టముక్కకు అంటించారు. తదుపరి ప్లాస్టిక్ వైరు కట్టి చెప్పుల దండ, బోర్డును ఆదే రోజు రాత్రి విగ్రహం ఎడమ చేతికి తగిలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం, పలు రకాలు సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి వివిధ కోణాలలో సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించారు. నిందితులు నేరం అంగీకరించినట్లు డీఎస్పీ చెప్పారు. వారిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. నేరానికి ఉపయోగించిన వస్తువులు, సెల్ ఫోన్లు, రెండు మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి ఛేదించిన దర్యాప్తు అధికారి డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ దొరరాజు, ఎస్‌ఐ జానీబాషా, సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించారు.

శృంగార వల్లభస్వామి ఆలయానికి

పోటెత్తిన భక్తులు



పెద్దాపురం, జూన్ 15: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ. 2,85,020 అన్నదాన విరాళాలు రూ.52,591 ఆదాయం, కేశ ఖండన ద్వారా రూ.7,360, తులా భారం రూ.400, లడ్డూ ప్రసాదం ద్వారా 36,540, వెరసి రూ. 3,81,911 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 10 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

రాజానగరం, జూన్ 15: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవరైనా రేషన్ బియ్యాన్ని కొనడం, అమ్మడం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. శనివారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని విజిలెన్స్ అధికారులు రాజానగరంలో స్వాధీనం చేసుకున్నారు. జాతీయ రహదారి రాజానగరంలోని వాసవి ప్రియ పికిల్స్ సమీపంలో రేషన్ బియ్యం లోడుతో ఒక వ్యాన్ వెళ్తోందని వచ్చిన సమాచారం మేరకు వాహనాన్ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 10,450 కిలోల బియ్యం బస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పెదవేగి గ్రామానికి చెందిన ఉప్పల ప్రకాష్‌కు చెందినవిగా అధికారులు నిర్ధారించారు. వాహన డ్రైవర్ కొత్తపల్లి నాగరాజు ఏలూరు నుంచి రాజానగరం మండలానికి రవాణా చేస్తుండగా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.10,75,475 ఉంటుందని, నిందితులపై 6-ఏ కింద కేసు నమోదు చేసి క్రిమినల్ కేసులు నమోదుకు పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేశామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరెడ్డి, భార్గవ మహేష్, కానిస్టేబుల్స్ లోవరాజు, శివ, సీఎస్‌డీటీ దివాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, జూన్ 15: అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని హైదరాబాద్‌కు చెందిన పసుపులేటి సుజాత శనివారం దర్శించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు, వేద పండితులు ఆమెకు వేదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేసి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.



హోం మంత్రికి ఘనస్వాగతం

తుని రూరల్, జూన్ 15: హోం మంత్రిగా బాధ్యతలు చేపట్టి తుని మీదుగా పాయకరావుపేట వెళ్తున్న వంగలపూడి అనితకు తునిలో టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికి గజమాలలతో సత్కరించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు సుర్ల లోవరాజు, టీడీపీ నాయకులు కుసుమంచి సత్యనారాయణ, మళ్ళ గణేష్, బోడపాటి శ్రీను ఉన్నారు.

ప్రజలకిచ్చిన హామీ నిలబెట్టుకున్న చంద్రబాబు

జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్

కాకినాడ సిటీ, జూన్ 15: తొలి 5 సంతకాలతో ప్రజల కిచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలుపై తొలి సంతకాలతో చంద్రబాబు పాలన ప్రారంభమైందన్నారు. మెగా డీఎస్సీపై తొలి సంతకంతో 16,347 ఉపాధ్యాయ నియామాలకు టీడీపీ కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ రెండో సంతకం చేయడంతో ప్రజల భూములకు భద్రత ఏర్పడిందన్నారు. అవ్వా తాతల పింఛను రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం చేయడంతో 66 లక్షల మందికి లబ్ధి చేకూరిందన్నారు. అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తూ నాల్గో సంతకం చేయడంతో పేదలు, కూలీల ఆకలి తీర్చినట్లయ్యిందన్నారు. నైపుణ్య గణనపై ఐదో సంతకం చేయడం వల్ల యువత స్కిల్స్ అభివృద్ధి చెంది ఉద్యోగావకాశాలకు మెరుగైన బాట చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా కూటమి పాలన సాగుతుందనడానికి ఈ 5 నిర్ణయాలు సంకేతాలన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సర్పవరం జంక్షన్, జూన్ 15: సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే 5 పథకాలపై చంద్రబాబు సంతకాలు చేసినందుకు కృతజ్ఞతగా శనివారం కాకినాడ రూరల్లో టీడీపీ మహిళా సీనియర్ నాయకురాలు వేటుకూరి నాగమణి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) హాజరయ్యారు. పార్టీ నాయకులు రెడ్డి, కౌజు నెహ్రూ, యజ్జల బాబ్జీ, ఎం. శ్రీనివాసరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి హర్షం

జగ్గంపేట, జూన్ 15: కూటమిలో భాగంగా ఎన్నికల్లో ఘన విజయం సాధించి డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మంత్రిత్వ శాఖలో భాగంగా మరిన్ని శాఖలు కేటాయించడంపై జనసేన జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పవన్‌కు పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల కేటాయించారన్నారు. ఎన్నిక హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు 5 అంశాలపై సంతకం చేయడం హర్షణీయమన్నారు.

'ఆడపిల్లను కాపాడుదాం- చదివిద్దాం'

సామర్లకోట, జూన్ 15: నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లను కాపాడుదాం-ఆడపిల్లలను చదివిద్దాం అంటూ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులతో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యూ.మీనామాధురి నేతృత్వంలో ర్యాలీ చేశారు. ఐసీడీఎస్ పెద్దాపురం ప్రాజెక్ట్ సీడీపీవో జీ.ఉషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ బడులలో అందుతున్న సదుపాయాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రసూన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మంగ, సుల్తానా బీబీ, సీఆర్పీలు తనూజ, శ్రీనివాస్, నాగమణి,విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతులందరికీ విత్తనాలు పంపిణీ చేయాలి'

కోటనందూరు, జూన్ 15: ఖరీఫ్‌కు సంబంధించి రైతులందరికీ విత్తనాలు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలని ఎంపీపీ లగుడు శ్రీనివాస్ వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఖరీఫ్‌కి సంబంధించి ఎక్స్‌జిఎల్, 1064 విత్తనాలు అందించడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. గృహనిర్మాణానికి సంబంధించిన బిల్లులు త్వరగా అందించాలని సభ్యులు కోరారు. కొత్త ప్రభుత్వం కక్ష సాధింపు లేకుండా పాలన అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామలక్ష్మి, ఎంఈవో శ్రీనివాస్, రత్నతేజ పాల్గొన్నారు.

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలపై ప్రచారం

ఏలేశ్వరం, జూన్15: పట్టణంలో శ్రీఅనంతలక్ష్మీ సమేత సత్యనారాయణస్వామి ఆలయ కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ అర్చకులు పొన్నూరి సత్యనారాయణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆటోపై మైక్ ద్వారా మండలంలోని పలు గ్రామలతోపాటు ఇర్రిపాక, మామిడాడ, సోమవారం, కృష్ణవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అర్చకులు మాట్లాడుతూ సోమవారం రాత్రి దివ్య కల్యాణం నిర్వహిస్తామని, కల్యాణానికి అన్నవరం ఈవో రామచంద్రమోహన్ హాజరై స్వామి,అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, ఈనెల 22 వరకు ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కాపు కల్యాణ మండపం ఆధునికీకరణ పనులు

సామర్లకోట, జూన్ 15: సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గత వైసీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యం చేసిన కాపు కల్యాణ మండపాన్ని ఆధునికీకరణ పనులను ఎట్టకేలకు శనివారం మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ కమిషనస్ ఆదేశాల మేరకు ఇంజనీరింగ్ అధికారులు మండపాన్ని శుభ్రపరిచి ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు, తుప్పలను తొలగించి చదును చేసే పనులను ఎక్స్‌కవేటర్‌తో పెద్దఎత్తున నిర్వహించారు. పనుల అమలు తీరును మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావుతో బాటూ సామర్లకోట టీడీపీ నాయకులు పర్యవేక్షించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

పెద్దాపురం, జూన్ 15: ఉపాధి పనులు చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై ఉపాధి వేతనదారుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని గుడివాడలో శనివారం జరిగింది. ఏపీవో బండే రాజుబాబు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మావుళ్ల భద్రరావు (59) ఉపాధి పనుల్లో భాగంగా పంట కాలువ పనులు చేస్తుండగా పనిప్రదేశంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆసుపత్రికి తీసుకువెళదామనుకునే సరికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబానికి ఉపాధి హామీ పథకం ద్వారా అందే పరిహారం త్వరలో ప్రభుత్వ ఆదేశాల మేరకు అందజేస్తామని ఏపీవో తెలిపారు.

రేబీస్‌తో మహిళ మృతి

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 15: రేబీస్‌కు గురైన ఓ మహిళ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. వివరాల ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామానికి చెందిన ఉస్సే ప్రియాంక (29) జనవరిలో కుక్క కాటుకు గురైంది. చిన్న గాయమే కదా అని నిర్లక్ష్యం చేసింది. అయితే గత 4 రోజులుగా ఆమెలో రేబీస్ లక్షణాలు కనిపించడంతో ఆమెను కుటుంబీకులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడ వైద్యుడి సూచన మేరకు శనివారం ఉదయం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ ఆమెకు వైద్య పరీక్షల అనంతరం రేబీస్‌గా నిర్ధారించారు. దానితో ప్రియాంకను వైద్యులు ప్రత్యేక వార్డుకు తరలించి చికిత్సను అందజేస్తుండగా పరిస్థితి విషమించి కొద్ది సేపటికే మృతిచెందింది.

'విద్యావ్యవస్థలో మార్పులు చేయాలి'

పిఠాపురం, జూన్ 15: రాష్ట్రంలో కొలువుదీరిన కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో మార్పులు చేయాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ కాకినాడ జిల్లా శాఖ కోరింది. కోట్లాది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిన ప్రభుత్వానికి యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణికుమార్, సాయికృష్ణ అభినందనలు తెలియజేశారు. మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు తొలి సంతకం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నేడు గౌరకృష్ణ గురుదేవుల శోభా యాత్ర

పోర్టు సిటీ (కాకినాడ), జూన్ 15: దక్షిణ భారత ప్రసిద్ధ ముముక్షుజన మహాపీఠం పీఠాధిపతులు ముత్తీవి గౌరకృష్ణ గురుదేవులు కాకినాడ విచ్చేస్తున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం నగరంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నామని శ్రీ యతేంద్ర సేవా సమితి, మాస్టర్ ఇ.కె.ఆధ్యాత్మిక సేవా సంస్థ కాకినాడ శాఖల ప్రతినిధి వాసుదేవ తెలిపారు. కాకినాడలోని ఎస్‌వీఎస్ గృహం నుంచి రామారావుపేట గాయత్రి మండపం వరకు యాత్ర, అనంతరం రామారావుపేటలో గాయత్రి మండపం శ్రీ మదాంధ్ర శాస్త్ర పరిషత్‌లో ప్రార్థన, సమిష్టి పారాయణ జరుగుతాయి.

ప్రభుత్వ ప్రాధాన్యతలు గుర్తించి పని చేయాలి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, జూన్ 15: ప్రజా ఆకాంక్షలతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వ ప్రాధాన్యతలను గుర్తించి సమష్టిగా అంతా కలసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం, జిల్లా నలుమూలల నుంచి వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ, వార్డు ఉద్యోగులు, మహిళా శక్తి సంఘాల ప్రతినిధులు, రైతులు, యువకులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున గొడారిగుంటలోని నానాజీ నివాసానికి తరలివచ్చి ఎమ్మెల్యేగా విజయం, 5 అంశాలపై సీఎం చంద్రబాబు సంతకాలు చేయడంపై శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు, పండితులు, పాస్టర్లు వచ్చి నానాజీకి దీవెనలు, పూజలు, ప్రార్థనలు చేశారు. ఉద్యోగులకు సమస్యలేమైనా ఉంటే నేరుగా తన వద్దకు వచ్చి తెలియజేయాలని, ఎల్లవేళలా ప్రజలు, అధికారులకు అందుబాటులో ఉంటానని నానాజీ తెలిపారు.



సర్పవరం జంక్షన్: నానాజీకి అభినందనలు తెలియజేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

బీచ్ అభివృద్ధికి కృషి చేయాలి

ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఉన్న కాకినాడ బీచ్ అభివృద్ధి, సుందరీకరణకు చర్యలు తీసుకోవాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. శనివారం రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలబొకే ఇచ్చి సత్కరించారు. కూటమి ప్రభుత్వంలో జనసేన తరపు నుంచి ప్రతిష్టాత్మక మంత్రి పదవి చేపట్టడం ఆనందంగాఉందన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పర్యాటక రంగం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రికి వివరించారు. రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా కాకినాడ బీచ్ అభివృద్ధి, హోప్ ఐలాండ్ అభివృద్ధికి సహకారం అందిస్తానని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిరంగు శ్రీనివాసరావు, శెట్టి బాబూరావు, సంగిశెట్టి రాంబాబు, సానా సత్యనారాయణ పాల్గొన్నారు.

నానాజీకి అభినందనలు

కరప, జూన్ 15: అధికారులు బాధ్యతగా మెలుగుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) సూచించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన నానాజీని శనివారం కరప మండల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నానాజీ అధికారులతో ముచ్చటించారు. గ్రామాల్లో ప్రజలె సమస్యలను గుర్తించి నివేదికను రూపొందించాలన్నారు. శాసనసభ సమావేశాలనంతరం అన్ని శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటుచేసి కార్యాచరణ ప్రణాళికను రూపొందిద్దామని స్పష్టంచేశారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, ఏవో గుత్తుల భీమశంకరరావు, ఈవోపీఆర్డీ బసవరాజు సత్యనారాయణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో జీవీ రమణకుమార్, ఐకేపీ ఏపీఎం ఎంఎస్ బాలాదేవి, ఆర్ఐ పేపకాయల మాచరరావు తదితరులుశుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలల బలోపేతానికి చర్యలు

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ఎమ్మెల్యేను అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రత్తిపాడు, జూన్ 15: నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. శనివారం మండలం యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు కోడి శ్రీను, దొడ్డిపట్ల రాజబాబు, యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఆర్.రామలింగేశ్వరరావు సత్యప్రభను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. యూటీఎఫ్ నాయకులు ఎస్. నాగేశ్వరరావు, ఎస్ఈ సూర్యనారాయణ, ఎంవీ రమణ, చుక్కల గణేష్, సూర్యావతి, సురేష్, పి.జ్యోతి పాల్గొన్నారు. మండల ఈ సేవా కేంద్రాల నిర్వాహకులు సత్యప్రభకు వినతిపత్రం అందజేసి ఇబ్బందులు పరిష్కరించాలని కోరారు. నిర్వాహకులు కాశీ విశ్వనాద్, పోలిశెట్టి త్రిమూర్తులు, మంతెన పద్మరాజు, కొమ్ముల ఆనంద్, యాళ్ల నారాయణ మూర్తి, రాయుడు, రాయి రాణిబాబు, సుధాకర్ ఉన్నారు.

సత్యప్రభకు సత్కారం

ఏలేశ్వరం, జూన్ 15: నగర పంచాయితీ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి నేతృత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా ప్రత్తిపాడు తరలివెళ్లి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను గజమాలతో ఆమె నివాసం వద్ద ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అలమండ చలమయ్య, పాండ్రంకి అప్పారావు, మలిరెడ్డి సూరిబాబు, చల్లా గణేష్, అలమండ వీర్రాఘవస్వామి ఉన్నారు.

'అభివృద్ధిలో ప్రాధాన్యమివ్వాలి'



ఎమ్మెల్యేను కలసిన సీతారామపురంవాసులు

తాళ్లరేవు, జూన్ 15: కోరింగ పంచాయతీ సీతారామపురం గ్రామానికి అభివృద్ధిలో ప్రాధాన్యత నివ్వాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కోరారు. టీడీపీ అమలాపురం పార్లమెంటరీ అధ్యక్షుడు టేకుమూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో సీతారామపురం టీడీపీ కార్యకర్తలు, యువకులు ఎమ్మెల్యేను కలసి అభినందనలు తెలియజేశారు. సీతారామపురంలో దీర్ఘకాలికంగా ఉన్న డ్రైనేజీ, రోడ్లు, తాగునీరు సమస్యలను పరిష్కరించాలని కోరారు. పి.మల్లవరం టీడీపీనేత ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు ఓఎన్‌జీసీ నిధులతో పి.మల్లవరం గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. తాళ్లరేవు కమ్యూనిటీ హెల్త్‌సెంటరును అభివృద్ధి చేయాలని డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో సిబ్బంది ఎమ్మెల్యేను కలసి కోరారు. పోలేకుర్రు రెవెన్యూ ఉపయోగించుకుంటున్న రిలయన్స్, ఓఎన్‌జీసీ సంస్థల ద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని టీడీపీనేతలు జక్కుల ప్రసాద్‌బాబు, వడ్లమూరి సతీష్ కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దాట్ల తెలిపారు.

జనసేన పాదయాత్రకు స్వాగతం

గొల్లప్రోలు, జూన్ 15: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో జనసేన నాయకులు, జనసైనికులు మొక్కులు తీర్చుకుంటున్నారు, అచ్చంపేట నుంచి అన్నవరం వరకూ జనసేన నేతలు, కార్యకర్తలు శనివారం పాదయాత్ర చేపట్టారు. వారికి గొల్లప్రోలులో జనసేన నాయకుడు బలిరెడ్డి గంగబాబు ఆధ్వర్యంలో జనసైనికులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బలిరెడ్డి గంగబాబు, గారపాటి జైగణేష్, గుత్తుల రాంబాబు, గడ్డమూరి దొరబాబు, కర్రి రాజా, బలిరెడ్డి నాని, పాలింకి మధు ఉన్నారు.

డీసీసీబీలో అవగాహనా కార్యక్రమం

కాకినాడ రూరల్, జూన్ 15: కాకినాడ డీసీసీబీలో శనివారం మైక్రోలెర్నింగ్ సెంటర్‌పై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆప్కాబ్ విశ్రాంత జనరల్ మేనేజర్ మస్తాన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొనగా డీసీసీబీ సీఈవో ఆర్వీ నరసింహారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మస్తాన్‌రావు మాట్లాడుతూ ఈప్రాజెక్టు ద్వారా సంఘాలకు, సిబ్బందికి, రైతులకు, సలహాలు, ఎస్ఎంఎస్‌లు, ఫోన్ కాల్స్, సూచనలు ఇస్తున్నామన్నారు. డీసీసీబీ జీఎం ప్రకాష్, డీడీఎం బాపూజీ, వివిధ సంఘాల సీఈవోలు, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

గొల్లప్రోలు రూరల్, జూన్ 15: గొల్లప్రోలు మండల పరిధిలోని గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చేబ్రోలు, దుర్గాడ తదితర గ్రామాల్లో రోడ్లు వెంబడి, వీధుల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించే పనులు చేపట్టారు. డ్రెయిన్లల్లో పూడిక ను తొలగించారు. మండల గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఈవోపీఆర్డీ కుమార్ తెలిపారు.

ఉప సర్పంచ్‌కు సత్కారం

గండేపల్లి, జూన్ 15: మండలంలోని మురారిలో టీడీపీ కూటమి గెలుపునకు కృషి చేసిన గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్‌కుమార్‌ను శనివారం ఆర్యవైశ్య సంఘ సభ్యులు దుశ్శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు.

చంద్రబాబు విజన్‌తో అభివృద్ధి పరుగులు

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూన్ 15: రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెనువెంటనే ఎన్నికల హామీలో భాగంగా తొలి రోజునే ఐదు కీలకహామీలు అమలుకు చెంది సంతకాలు చేయడంతో చంద్రబాబు విజన్‌తో అభివృద్ధి పరుగులెడుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మ కాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని అచ్చంపేటలోని తన స్వగృహంలో శనివారం రాజప్ప విలేకర్లతో మాట్లాడుతూ ప్రధానంగా నిరుద్యోగ యువత ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న మెగా డీఎస్సీపై సంతకం చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా 16,340 పోస్టులు నియామకానికి సిద్ధం అయ్యారన్నారు. యువత ఆశలు ఫలించి నట్లు అయ్యిందన్నారు. ల్యాండ్ టైటి లింగ్ యా క్ట్‌ను రద్దు చేసేలా సంతకం ఎందరో లబ్ధి పొందుతారన్నారు. ఫించన్‌ను రూ.4వేలుకు పెంపుపై సంతకం కూడా ఎందరో వృద్ధులకు ఆర్థికంగా మేలు కలుగుతుందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం, విశాఖ ఆర్థిక రాజధానిగా రూపుదిద్దేందుకు నిర్ణయించి సంతకాలు చేయడంతో ప్రజల ఆశలు, ఆశయాలకు ఒమ్ము కాని రీతిలో చంద్రబాబు పాలన ఉంటుం దనేందుకు తొలి 5 సంతకాలే నిదర్శనమని తెలిపారు.



రాజప్పను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

రాజప్పకు పలువురి అభినందన

పెద్దాపురం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్న చినరాజప్పకు శనివారం అచ్చంపేటలోని ఎమ్మెల్యే స్వగృహానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటుకూరి సూర్యనారాయణ రాజు తదితర బీజేపీ నాయ ుకులు చేరుకుని రాజప్పను పూలమాలలతో ముంచెత్తి అభినందించారు. సామర్లకోట మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి వెంకట అప్పారావు చౌదరి, మాజీ మార్కెటింగ్ కమిటీ నాయకులు కర్రి వెంకట రమణ, విశ్వ హిందూ పరిషత్ సామర్లకోట నాయకులు జీవీకె.మోహనరావు, హుస్సేన్ పురానికి చెందిన టీడీపీ నాయకులు చల్లాబుజ్జి, కోట అప్పారావు, చల్లా కొండ, తలారి శ్రీను రాజప్పను అభినందించారు. అలాగే రాజప్పను డీఈవో పి.రమేష్, ఎంఈవోలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, సమగ్ర విద్యాశాఖాధికారులు పూలమాలలతో అభినందించారు.

ఇంజనీర్లతో ఎమ్మెల్యే జ్యోతుల సమావేశం

జగ్గంపేట, జూన్ 15: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రావులమ్మ నగర్‌లోని క్యాంప్ ఆఫీసులో నియోజకవర్గంలోని ఇంజనీర్లు, ప్రాజెక్టు డీఈ గంగాధర్, ఈఈ మల్లికార్జునరావు, డీఈ ఉమాశంకర్, జేఈ నారాయణరావు, గ్రామ స్థాయి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కిర్లంపూడి మండలం సోమరాయణంపేటలో రైతు భరోసా కేంద్రం పూర్తికాకుండా బిల్లులు చేయించిన విషయంపై ప్రశ్నించి సమగ్ర విచారణ కావాలని ఆదేశించారు. 15రోజుల్లోగా మీ పరిధిలో గల రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, రోడ్లు వంటి పనులపై అవగాహన తెచ్చుకోవాలని అప్పుడు సమీక్ష ఏర్పాటు చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, కన్నబాబు, కందుల చిట్టిబాబు, పైడిపాల సూరిబాబు, అడబాల భాస్కరరావు, అడబాల ఆంజనేయులు, పాలకుర్తి ఆదినారాయణ, జంపన సీతారామచంద్రవర్మ, పాఠంశెట్టి మురళీకృష్ణ, బస్వా చిన్నబాబు, కుర్ల చినబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల

ఎమ్మెల్యేకు సత్కారాలు

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద జిల్లా యుటీఎఫ్ నాయకులు పీవీ ఆధ్వర్యంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు నగేష్, ప్రధాన కార్యదర్శి చక్రవర్తి, మాజీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌వర్మ, సాయిరాం, నూకరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. గోకవరం మండలం రంపయర్రంపాలెనికి చెందిన టీడీపీ కుటుంబ సభ్యులు నెహ్రూ, నవీన్‌ను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి ఉంగరాల రాము, సర్పంచ్ బాదంపూడి ప్రకాష్ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణ ప్రగతిపై ఎమెల్యే వనమాడి సమీక్ష



అధికారులతో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ సిటీ, జూన్ 15: కొమరగిరి దూరమైపోయింది.. దీంతో ఇళ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.. ఇదీ పేదల కిచ్చిన ఇళ్ల స్థలాల పరిస్థితి అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక జగన్నాధపురంలోని తన నివాసంలో శనివారం హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్, అధికారులతో కొండబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. కొమరగిరి, ఏపీ త్రయంలలో కాకినాడకు చెందిన పేదలకు ఇచ్చిన స్థలాలలో ఇళ్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. ఏపీ త్రయంలో ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నా, కొమరగిరిలో మందకొడిగా సాగడంపై అధికారులతో చర్చించారు. కొమరగిరి ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3లలో ఎన్ని ఇళ్లు గ్రౌండ్ అయ్యాయి, ఏ స్టేజ్‌లో ఉన్నాయి, ఎంతమంది మేపింగ్ చేయించుకున్నారనే వివరాలతో సమగ్ర నివేదిక తయారు చేయాలని ఆ తర్వాత లబ్ధిదారులను కలిసి ఇళ్లు నిర్మించుకోవడానికి ఆసక్తి చూపే వారి జాబితా తయారు చేయాలన్నారు. ఈ నివేదికలను ప్రభుత్వానికి అందజేసి ఇళ్ల నిర్మాణానికి అదనపు సాయం కోరతానని కొండబాబు తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కొండబాబును కలిసిన అధికారులు

ఎమ్మెల్యే వనమాడి కొండబాబును శనివారం పలువురు అధికారులు, వివిధ వర్గాల వారు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగ పెన్షనర్లు కలిసి మొక్క బహూకరించారు. గత ప్రభుత్వంలో తమకు రావల్సిన ఎరియర్స్, ఇతర బెనిపిట్స్ అందలేదని.. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగులకు, పెన్షనర్లకు మంచి జరుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత

గురజనాపల్లి (కరప), జూన్ 15: స్థానిక పబ్బినీడి పాపారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 80మంది విద్యార్థులకు సోషల్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. పాఠశాలలో పనిచేస్తున్న సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులు ఐ.ప్రసాదరావు, పి.మాణిక్యాంబ తమ సొంత నిధులు వెచ్చించి ఈ స్టడీ మెటీరియల్‌ను రూపొందించి హెచ్ఎం ఎ.సాయిమోహన్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచి పదో తరగతిలో సీబీఎస్ఈ సిలబస్ అమలు చేస్తున్నారని, ఆ సిలబస్‌ను అనుసరించి సోషల్ మెటీరియల్‌ను రూపొందించామన్నారు. ఈ మెటీరియల్‌ను భద్రపరుచుకుని రాబోయే పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు పి.భవాని, ఎం.ప్రభారాణి, టి.వేణుగోపాల్, ఎ.సూర్యనారాయణ, జి.అర్జునరావు, వి.శోభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 15: తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ఆపదలో ఉన్న వారికి సేవలను అందజేయడంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఎల్లప్పుడూ ముందుందని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ కొనియాడారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ భవన్‌లో కోస్ట్‌గార్డు, సెట్‌రాజ్, శ్యామ్ ఇనిస్టిట్యూట్ వారిచే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కోస్ట్‌గార్డు కమాండెంట్ టిఆర్‌కె రావు ప్రారంభించి రక్తదానం చేశారు. ముఖ్యఅతిథిగా రమేష్ హాజరయ్యారు. కాకినాడ సిపోర్టు లిమిటెడ్, ఆదిత్య విద్యా సంస్థలు, వికాస, దొంతమూరు యూత్, పద్మ పూజిత ఫైనాన్స్ సంస్థలు రక్తదాతలైన జె.అరవింద్, అజర్ మొహిద్దీన్‌ను సత్కరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, సెట్రాజ్ సీఈవో మూర్తి, వికాస పీడీ లచ్చారావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.శివకుమార్ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన మాజీ ఎమ్మెల్యే దంపతులు



అచ్చెన్నాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, జూన్ 15: రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, నారా లోకేశ్‌లను శనివారం విజయవాడ ఉండవిల్లిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి మర్యాద పూర్వకంగా కలుసుకుని బొకేలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీని అత్యధిక మెజారిటీ సాధించేలా కృషి చేసిన పిల్లి దంపతులను అచ్చెన్నాయుడు, లోకేశ్ అభినందించారు. భవిష్యత్తులో పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు.

ఎంపీని కలిసిన కమిషనర్



ఎంపీకి బొకే అందజేస్తున్న అధికారులు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 15: కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, వివిధ విభాగాల అధికారులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యుత్ నగర్‌లోని చెల్లా ఫంక్షన్‌హాల్‌లో ఎంపీని కలిసి అభినందనలు తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి కాకినాడను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేద్దామని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, కార్యదర్శి ఎం.ఏసు బాబు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ మాధవి ఉన్నారు.

యనమలను కలిసిన వంతల



యనమలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వంతల

తుని రూరల్, జూన్ 15: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును తేటగుంట టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, నియోజకవర్గంలో టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించారు. యనమల మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు వచ్చాయన్నారు. తుని ఎమ్మెల్యే యనమల దివ్య, టీడీపీ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగసోమరాజు(అబ్బాయి), మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయన, కుసుమంచి సత్యనారాయణ, గాడి రాజుబాబు తదితరులున్నారు.

రైతులకు ఉచితంగా భోజనాలు

పిఠాపురం, జూన్ 15: పట్టణంలోని పశువుల సంత వద్ద ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ అన్న పానీయ సదుపాయ కేంద్రంలో వరుసగా 61వ వారం శనివారం సాయిప్రియ సేవాసమితి ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా భోజనాలు అందించారు. వివిధ ప్రాంతాల నుంచి సంతకు వచ్చే రైతులు ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతో భోజనాలు ఏర్పాటు చేశామని సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపకుడు, జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తెలిపారు. జనసేన నాయకులు అల్లం కిషోర్, కీర్తి చిన్నా, కోలా నాని, జ్యోతుల నాని, విప్పర్తి శ్రీను పాల్గొన్నారు.

మరిడమ్మ జాతరకు పందిర రాట

పెద్దాపురం, జూన్ మే 27: భక్తుల కొంగు బంగారం మరిడమ్మ జాతర మహోత్సవాలు వచ్చే నెల 4 నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా శనివారం పందిరి రాట ముహూర్త కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మజీ ఆధ్వర్యంలో చేపటారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారి తొలి గరగలను తీయడం జరిగిందని అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ

సర్పవరం జంక్షన్, జూన్ 15: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం ఏపీఎస్పీ వద్ద నున్న ఆదర్శ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాందేవు సీతయ్యదొర, బావిశెట్టి ప్రసాద్, కూరాకుల చినబాబు, గొల్లపల్లి రాంబాబు, వాసిరెడ్డి జ్యోతీవీరకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

కిర్లంపూడి, జూన్ 15: వీరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఎంపీపీ తోట రవి నూతన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో తోట గాంధీ, టీడీపీ నాయకులు గొల్లపల్లి సూరిబాబు, గంటా వెంక న్న, జనసేన ప్రధాన కార్యదర్శి పిడుగు జయబాబు, హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ పెద్దాడ లోవబాబు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కార్యదర్శి పర్యటన

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 14: ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై శనివారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ యూనియన్ సభ్యులు మున్సిపల్ సర్కిల్లో పర్యటించారు. 50 బిల్డింగ్స్ సెంటర్‌లో సాయిబాబాగుడి దగ్గర మత్తర కార్యాలయం వద్ద రెండో సర్కిల్లో కార్మిక సమస్యలను ఆయన తెలుసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగ్గంపేట రూరల్, జూన్ 15: మండలంలోని జె. కొత్తూరులో కాకినాడ సూర్యగ్లోబల్ హస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చ్ పాస్టర్ కాపరి, డాక్టర్లు దక్షిణమూర్తి, శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ అశోక్, వర్మ, పీఆర్వో జగదీష్, నాగేంద్ర, సంధ్య, ఐసీజీ సంధ్య, రేణుకా, నగరిక పాల్గొన్నారు.

'ఆ ప్రచారంలో వాస్తవం లేదు'

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 15: గుంటూరు నుంచి కాకినాడ వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ కె.వెంకటేశర్లు సస్పెన్షన్ అక్రమమని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని కాకినాడ ఆర్టీసీ డీఎస్ ఎంయువి మనోహర్ తెలిపారు. ఈ సంఘటనపై మే 2న అసిస్టెంట్ మేనేజర్(టి), అసిస్టెంట్ ఇం జనీర్(ఎం) ఇచ్చిన రిపోర్టుపై విచారణ చేయగా డ్రైవర్ తప్పు కనిపించిందని, వాస్తవాలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.